సాక్షి ఒడిశా

మంగళవారం। 17। సెప్టెంబర్। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ.4,94,539
బంగారం: 200 మిల్లీ గ్రాములు
వెండి: 23 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



ప్రారంభమైన బలి జాతర పూజలు
రాయగడలో ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా బలి జాతర పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.
- 8లో



అలెర్ట్..! - 8లో
సుందర్‌గడ్, కెంజొహార్ జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది.

న్యూస్‌రీల్

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా రైజింగ్ స్టార్స్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: పట్టణంలోని విక్రమ క్రీడా మైదానంలో జయపురం అరవింద క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో రైజింగ్ స్టార్స్ టీమ్ విజేతగా నిలిచింది. జయపురం రైజింగ్ స్టార్స్, కొరాపుట్ ఉమ్మిరి టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. అయితే నిర్ధారిత సమయంలో రైజింగ్ స్టార్స్ టీమ్ ఒక గోల్ సాధించి విజేతగా నిలిచింది. విజేత టీమ్‌కు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం



డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదలలో డెంగీ విజృంభిస్తుండంతో వ్యాధిపై అప్రమత్తతంగా ఉండాలని మునిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన సిబ్బంది చైతన్యపరిచారు. సోమవారం పీహెచ్‌సీకి చెందిన టెక్నికల్ సూపర్‌వైజర్ మనోరంజన్ చౌదరి నేతృత్వంలో ఆరోగ్య కార్యకర్తలు అంబొదలలో ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీపై నిర్లక్ష్యం వహిస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని, అందువల్ల అనారోగ్యం సంభవిస్తే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం, దోమ తెరలను వినియోగించడం వంటి జాగ్రత్త చర్యలు తీసుకుంటే డెంగీ నుంచి కాపాడుకోగలమన్నారు.

దత్తత కేంద్రం నూతన భవనం ప్రారంభం



దత్తత కేంద్ర భవనం ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి రాణిపేట గ్రామంలో జిల్లా దత్తత కేంద్రం నూతన భవనాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ సోమవారం ప్రారంభించారు. గత ఐదేళ్లుగా దత్తత కేంద్రం అద్దె భవనంలో ఉండేది. అక్కడ అనాథ శిశువులను చేరదీసి, సంతానం లేనివారికి నిబంధనల మేరకు దత్తతగా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సమితి చైర్మన్ ఛిత్రి సింహాద్రి, శిశు సంక్షేమ సమితి అధ్యక్షుడు అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేట్ బస్సు



చెట్టును ఢీకొన్న బస్సు

పర్లాకిమిడి: మోహనా – పుడామత్రి – దిగపహండి – బరంపురం ప్రైవేటు బస్సు తప్తపాణి ఘాటీ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. గంజాం – గజపతి సరిహద్దు పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని దేవీ మందిరం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్నటువంటి 40 మందికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పట్టపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసుని విచారిస్తున్నారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య



రాయగడ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దీనిలో భాగంగా సోమవారం ఆయా ప్రాంతాల్లో కొలువైన విగ్రహాల నిమజ్జనోత్సవ యాత్రలు వేడుకగా నిర్వహించారు. స్థానిక లారీ యజమానుల సంఘం, ఎద్దువీధి, కేసీబీ తదితర ప్రాంతాల్లోని వినాయకులు గంగమ్మ ఒడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా యువకులు, నిర్వాహకులు ఆటపాటలతో సందడి చేశారు. – రాయగడ



నిమజ్జనానికి వెళ్తున్న భవానీ వీధిలో వినాయకుడు



కేసీబీ రోడ్డులో వినాయకుడి నిమజ్జనం



భవానీ వీధి గణనాథుడి నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న యువతులు



గణనాథుడి నిమజ్జనంలో చిందులు వేస్తున్న యువకులు



సరళ జంక్షన్‌లో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం



రాయగడ: నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడి విగ్రహం



నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మహిళలు

కోర్టు తీర్పును అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: కార్మికుల గ్రాచ్యుటీ బకాయిల వడ్డీతో చెల్లింపుపై ఒక ఓపీడీఆర్ కేసులో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సేవా పేపరు మిల్లు యాజమాన్యం మిల్లు విశ్రాంత కార్మికులందరికీ అమలు చేయాలని మిల్లు ప్రథమ యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి డిమాండ్ చేశారు. సోమవారం సేవా పేపరు మిల్లు విశ్రాంత కార్మికుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ.. అందుకు యాజమాన్యం అంగీకరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. యాజమాన్యం కోర్టులో బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్‌ను అంగీకరించినా, మిల్లులో కార్మికులందరికీ వర్తింపజేసేందుకు పలు సాకులు చెబుతోందని ఆరోపించారు. లేబర్ కమిషనర్ నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఒక నెల సమయం అడిగిందని, అయితే అది కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. విశ్రాంత కార్మికుల డిమాండ్లతో మంగళవారం కొత్త సబ్ కలెక్టర్‌ను కలిసి ఒక మెమోరాండం సమర్పించేందుకు సమావేశం తీర్మానించింది. సమావేశంలో కార్మిక నేతలు బసంత బెహర, సరోజ్ పండ, సురేష్ సామంతసింహార్, కె.అజయ కుమార్, పి.ప్రభాకరరావు, కేదార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన కొండచరియలు



ట్రాక్‌పై పడిన కొండ చరియలను తొలగిస్తున్న దృశ్యం

- రైళ్ల రాకపోకలకు అంతరాయం

రాయగడ: కొరాపుట్–రాయగడ (కేఆర్) రైల్వే లైన్‌లో భాగంగా కెవుటిగుడ రైల్వేస్టేషన్‌కు సుమారు 200 మీటర్ల దూరంలోని ట్రాక్‌పై సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొండ చరియలు జారిపడడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే ఇంజినీరింగ్ విభాగాధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. జారిపడిన కొండ చరియలను తొలగించడంతో పాటు ట్రాక్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో రైల్వేలైన్ విద్యుత్ తీగలు కూడా తెగిపడిపోయాయి. దీంతో విశాఖపట్నం నుంచి కొరాపుట్ వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హౌడా నుంచి జగదల్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లను కెవుటిగుడలో నిలిపివేశారు. రాత్రి కావడంతో పునరుద్ధరణ పనుల్లో జాప్యం నెలకొంది.

రక్తదానంతో ప్రాణదానం



జయపురం: రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. స్థానిక ఆర్‌సీఎం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాస్పత్రిలో జరిగిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మందికి ప్రాణదానం చేసే అదృష్టం కలుగుతుందన్నారు. యువత ముఖ్యంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్‌సీఎం సంస్థకు చెందిన సురేష్ విశ్వకర్మ మాట్లాడుతూ 1972వ సంవత్సరంలో ఏర్పాటైన ఆర్‌సీఎం సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల ఆదరణను పొందుతుందన్నారు. శిబిరంలో 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.



రాయగడ: రక్తదానం చేస్తున్న ఆర్‌సీఎం సభ్యులు, పక్కనే ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక

జయపురం: కొరాపుట్ జిల్లా దమంజోడిలో భారతీయ మజ్దూరు సంఘం సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించింది, దమంజోడి నల్కో సెక్టర్–1లోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో 128 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ శిబిరంలో 9 మంది దంపతులతో పాటు 128 మంది స్వచ్ఛందంగా రక్తందానం చేశారని నిర్వాహకులు వెల్లడించారు. శిబిరంలో ముఖ్య అతిథిగా నల్కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిరంజన్ శామల్, సీఆర్ఎస్ఎఫ్ సీనియర్ కమాండర్ సత్యదేవ్ ఆర్య, నల్కో చీఫ్ మేనేజర్ కేఎల్ జెన, సరోజ్ కుమార్ రథో తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు



పోలీసులు సీజ్ చేసిన తుపాకీ తదితర వస్తువులు

జయపురం: నంబర్ లేని కారులో తుపాకీ, సెల్‌ఫోన్లు, నకిలీ నంబర్ ప్లేట్లు పట్టుబడినట్లు నవరంగపూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారి కృష్ణచంద్ర బోత్ర సోమవారం వెల్లడించారు. ఈయన తెలిపిన వివరాల మేరకు.. నవరంగపూర్ ఏఎస్ఐ సుశ్వంత గౌరడ పోలీసు సిబ్బందితో ఆదివారం రాత్రి నవరంగపూర్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో బొరిగుమ్మ వైపు నుంచి నవరంగపూర్ వైపు అతివేగంగా వస్తున్న కారుని పోలీసులు ఆపమని సూచించినా ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్‌కు కారుకి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించమన్నారు. అయితే అతడి వద్ద ఏమీ లేకపోవడంతో చూపించలేకపోయాడు సరికదా, అతడి వద్దనున్న తుపాకీ చూపించి పోలీసులను భయపెట్టాడు. దీంతో పెట్రోలింగ్ టీమ్ అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు కారులో సోదాలు నిర్వహించగా రెండు సెల్‌ఫోన్లు, 5 సిమ్‌లు, ఒక కత్తి, నాలుగు నంబర్ ప్లేట్లు కనుగొని సీజ్ చేశారు. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నవరంగపూర్ సేవాపతి వీధికి చెందిన భుబణ గౌరడగా నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

రాయగడ: పాస్ట్‌ఫుడ్ దుకాణంలో పనిచేస్తున్న ఒక యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లాలోని పద్మపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు సంబల్‌పూర్‌లోని హిరాకుద్ ప్రాంతానికి చెందిన భికారి ప్రధాన్ (25)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సంబల్‌పూర్ హిరాకుద్ ప్రాంతానికి చెందిన భికారి గత కొన్నేళ్లుగా పద్మపూర్‌లోని ఒక పాస్ట్‌ఫుడ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పనులు ముగిశాక అదే దుకాణంలోని ఒక గదిలో పడుకుంటుంటాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దుకాణం యజమాని కొడుకు భికారిని తన ఇంటికి తినడానికి పిలిచేందుకు వెళ్లగా గది తలుపులు లోపలి నుంచి మూసివేసి ఉండడంతో విషయాన్ని తన తండ్రికి చెప్పాడు. దీంతో వారు అక్కడికి వెళ్లి తలుపులు విరగ్గొట్టి చూడగా, గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు.

జనసేవ కేంద్రంపై ఫిర్యాదు



జనసేవ కేంద్రం వద్ద బీజేపీ మహిళ కార్యకర్తలు

రాయగడ: స్థానిక రాణిగుడఫారంలోని నాలుగో వీధిలో ఉన్న జనసేవ కేంద్రంలో సుభద్ర యోజన ఫారాలు నింపేందుకు మహిళల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న అందిన ఫిర్యాదుల మేరకు బీజేపీ మహిళా కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. ఆ పార్టీకి చెందిన బీజేపీ మహిళా విభాగం నాయకురాలు మంజుల మినియాక నేతృత్వంలో కార్యకర్తలు అక్కడకు చేరుకుని జనసేవ కేంద్రం యజమానిని నిలదీశారు. సుభద్ర యోజన పథకానికి సంబంధించిన ఎటువంటి పని అయినా జనసేవా కేంద్రంలో ఉచితంగా చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా డబ్బులు తీసుకోవడం నేరమని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టేలా చూస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న కొంతమంది మహిళలు తమ వద్ద ఫారాలు నింపడానికి డబ్బులు వసూలు చేశారని బీజేపీ కార్యకర్తల ఎదుట చెప్పారు. అయితే అటువంటిదేమీ లేదని జనసేవా కేంద్ర నిర్వాహకులు తోసిపుచ్చారు.

సీతారాం ఏచూరి సంతాప సభ



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని దండుమాల వీధిలో ఉన్న సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో దివంగత పొలిట్ బ్యూరో సభ్యుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి (72) సంతాపం సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీతారాం ఏచూరి భారతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి జొన్న సుభాష్ చంద్రరావు అన్నారు. ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నాయకుడు దండపాణి రైయితో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి సూరయ్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి పైల మురళీకృష్ణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బంగారి, మోహిత్ మిశాల్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన బైక్, నాటుసారా



పట్టుబడిన చింగుడి హరిజన్

జయపురం: సదర్ పోలీసులు రెండు చోట్ల దాడులు జరిపి 95 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. ఈ రెండు ఘటనల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి సోమవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. జయపురం సమితి బొడొముజురుముండ గ్రామం ప్రాంతంలో చింగుడి హరిజన్ 50 లీటర్ల నాటుసారా తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే జయపురం సమితి కొండాపుట్ గ్రామానికి చెందిన దిలీప్ హరిజన్ అనే యువకుడు బైక్‌పై 35 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.



పట్టుబడిన దిలీప్ హరిజన్

క్లుప్తంగా

గంజాయి వ్యాపారి అరెస్టు



అరెస్టైన టున్న సోగరియా

మల్కన్‌గిరి: జిల్లా అవుట్ పోస్టు పోలీసులు ఆదివారం రాత్రి మల్కన్‌గిరి చంపకారి గ్రామం వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. ఆ సమయంలో టున్న సోగరియా అనే గంజాయి వ్యాపారిని పట్టుకొని, అతని వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆయనపై గంజాయి వ్యాపారం చేస్తూ పట్టుబడిన 8 కేసులు ఉన్నాయి. మల్కన్‌గిరి బస్టాండ్ వీధికి చెందిన టున్న మల్కన్‌గిరితో పాటు మరి కొన్ని రాష్ట్రాల్లో గంజాయి వ్యాపారం చేస్తుంటారు. ఆయనను పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

భువనేశ్వర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఒక్కరోజు పర్యటనకు మంగళవారం విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సోమవారం ప్రధాన మంత్రి భద్రత ఏర్పాట్లు సమీక్షించారు. వేదిక వద్ద ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో ఆయన చర్చించారు. స్థానిక గొడాకాణలో జరగనున్న మరో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో సైతం భద్రతా ఏర్పాట్లని ముఖ్యమంత్రి పరిశీలించారు.

ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి

పర్లాకిమిడి: పట్టణంలోని గణపతి ఉత్సవాల నిమజ్జన సమయంలో ఐదేళ్ల మైనర్ బాలికపై 51 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన భైనపిల్లి శేఖర్ బాలికను టాటా ఏస్ వాహనంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడం లేదని వెతకుతుండగా, కొంతమంది చిన్నారిని గమనించి కాపాడారు. అనంతరం శేఖర్‌ను బయటకు తీసుకొచ్చి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించినట్లు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. నిందితుడు గత కొంతకాలంగా స్థానిక కుంభారీ వీధిలో నివసిస్తున్నాడు. పర్లాకిమిడి ఆదర్శ పోలీసులు సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి పోక్సో చట్ట ప్రకారం కేసు పెట్టారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న యువరాణి కల్యాణీ దేవి

పర్లాకిమిడి: స్థానిక అంకావీధిలో గజపతి మహారాజుల ఇలవేల్పు మాణికేశ్వరీదేవి అమ్మవారు యువరాణి కల్యాణీ దేవి ద్వారా ఆదివారం రాత్రి పూజలందుకుంది. గజపతి వంశీయురాలు కల్యాణీ దేవి మాణికేశ్వరి దేవికి అంకపూజ చేసి మార్పులు (చేపలు) దేవికి నైవేద్యంగా పెట్టి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారి హారతులు అందుకున్నారు.

సారా విక్రయాలపై ఉక్కుపాదం



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

రాయగడ: నాటుసారా తయారీ, విక్రయాలపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా జిల్లాలోని టికిరి పంచాయతీ పరిధి ఉపారొడెప్కా గ్రామానికి సమీపంలోని నదీతీర ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా తయారీ కేంద్రంపై టికిరి పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీ గురించి నిల్వ ఉంచిన విప్ప ఊటను ధ్వంసం చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మరో ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సారవకోట: అలుదు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాకివలస గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు గాయాలపాలయ్యారు. మాకివలస నుంచి అలుదు వెళ్తున్న ఆటోలో మాకివలస గ్రామానికి చెందిన నెయ్యిల సరస్వతి, వాన రమ్య, వాన సావిత్రి ఎక్కారు. అయితే అలుదు సమీపానికి వచ్చేటప్పుడు ఆటోలో నుంచి వీరు ముగ్గురు జారి పడిపోవడంతో నెయ్యిల సరస్వతికి తీవ్ర గాయాలయ్యాయి. వాన రమ్య, వాన సాయమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి సారవకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి అనంతరం నెయ్యిల సరస్వతిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో శ్రీకాకుళం, మిగిలిన ఇద్దరినీ నరసన్నపేట తరలించారు.

అలెర్ట్..!



వీడియో కాన్ఫరెన్సులో ఎస్ఆర్‌సీ వరద సమీక్ష సమావేశం

- సుందర్‌గడ్, కెంజొహర్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన

భువనేశ్వర్: సుందర్‌గడ్, కెంజొహర్ జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు (7 నుంచి 20 సెంటీ మీటర్లు) కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక చేసింది. అలాగే మయూర్‌భంజ్, దేవ్‌గడ్, సంబల్‌పూర్, బరగడ్, ఝార్సుగుడ, అంగుల్ జిల్లాల్లో భారీ వర్షాలు (7 నుండి 11 సెంటీ మీటర్లు) కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఐఎండీ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఆకస్మిక విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పాలనా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ప్రజలు వాతావరణంపై నిఘాతో ఉండి పిడుగుపాటు ప్రమాదం నుంచి తమను తాము రక్షించుకోవడానికి సురక్షిత ఆశ్రయ కేంద్రాల్లో తలదాచుకోవాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో కృత్రిమ వరద, నీట మునిగిన రోడ్లు, మురుగు నీటి కాల్వల ముంపు వంటి ఆకస్మిక పరిస్థితుల నిర్వహణపై సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రధానంగా పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీ) కాలువల గుండా నీటి ప్రవాహం అడ్డంకి తొలగించి కృత్రిమ వరద పరిస్థితి నివారించాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు చేపల వేట నివారించాలని హెచ్చరిక జారీ అయింది.

కలెక్టర్లకు ఎస్ఆర్‌సీ హెచ్చరిక

సుందర్‌గడ్, బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లా కలెక్టర్లను ప్రత్యేక సహాయ కమిషనరు కార్యాలయం హెచ్చరించింది. ఈ ప్రాంతాల కలెక్టర్లు వరద పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని తెలిపింది. ఆకస్మిక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) ఆదేశించారు. గంగా తీరం పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లో తీవ్ర అల్పపీడనంతో భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాల్లో వరద వంటి పరిస్థితులపై ఎస్ఆర్‌సీ సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలాసోర్ మరియు మయూర్‌భంజ్‌లలో గత 3 రోజులుగా తెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీని ప్రభావంతో సువర్ణ రేఖ, బుడోబొలాంగొ, జలకా నదుల్లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏవైనా అత్యవసరాలను ఎదుర్కొనేందుకు పరిస్థితిని చాలా నిశితంగా పరిశీలించాలని ఈ రెండు జిల్లాల కలెక్టర్లకు సూచించింది. బాలాసోర్ జిల్లాలో గాలింపు, సహాయక చర్యల కోసం 1 యూనిట్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, 6 యూనిట్ల ఒడ్రాఫ్ బృందాలు మరియు 10 యూనిట్ల అగ్నిమాపక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మయూర్‌భంజ్‌లో 7 యూనిట్ల ఒడ్రాఫ్ బృందాలు, 1 యూనిట్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం మరియు 12 యూనిట్ల అగ్నిమాపక బృందాలు సిద్ధంగా ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే వండిన ఆహారాన్ని అందించాలని ప్రత్యేక సహాయ కమిషనరు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏడీఎం, సబ్ కలెక్టర్, అడిషనల్ సబ్ కలెక్టర్ వంటి సీనియర్ అధికారులను బలహీన ప్రాంతాల్లో తాజా స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు మోహరించాలని సూచించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

రాయగడ: పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు సమీపంలోని మసీద్ నుంచి ముస్లింలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మత గురువులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి దుర్మరణం

జయపురం: నందాహండిలోని చెరువులో పడి యువకుడు దుర్మరణం చెందాడు. మృతి చెందిన యువకుడు బి.మాలిగుడ గ్రామానికి చెందిన గుప్త మాలి(30)గా గుర్తించారు. గుప్తమాలి ఆదివారం చెరువులో పడి మునిగిపోవడం ఆ గ్రామంలో కొంతమంది చూశారు. వెంటనే వారు గ్రామస్తులకు తెలపగా తెంతులికుంటి అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించి గుప్త మాలి మృతదేహాన్ని బయటకు తీసినట్లు డొంగరబెజ పోలీసు పంటి పోలీసు అధికారి గుణనిధి బాగ్ వెల్లడించారు. గుప్తకి భార్య, మూడేళ్ల కుమార్తెతో పాటు తల్లి ఉన్నారు. తహసీల్దార్ వనమాలి బెహర అతడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మృతుని కుటుంబానికి రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందేటట్లు చూడగలమని వారికి హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఐదుగురు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన యువకులు

భువనేశ్వర్: నగరంలో సోమవారం తీవ్ర కలకలం రేగింది. స్థానిక జనపథ్ మార్గంలో గుర్తు తెలియని యువకులు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఈ మార్గంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. వీరి నిర్లక్ష్య డ్రైవింగ్ ఎవరి ప్రాణాలను బలిగొంటుందోననే భయాందోళనతో ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకున్నారు. ఈ పరిస్థితి వీడియో క్లిప్పింగుతో సాంఘిక మాధ్యమంలో ప్రసారం కావడంతో స్పెషల్ స్క్వాడ్ తక్షణమే రంగంలోకి దిగింది. నిరంతరం రద్దీగా ఉండే జనపథ్ మార్గంలో డివైడర్లు మరియు పేవ్‌మెంట్‌లపై వాహనాలు నడుపుతూ ఈ మూక దుమారం రేపారు. స్థానిక లక్ష్మీసాగర్ ఠాణా పోలీసులు ఈ నిర్లక్ష్యానికి పాల్పడిన 5 మంది యువకులను కొన్ని గంటల్లో అరెస్టు చేశారు. వీరి అధీనంలో ఉన్న రెండు 4 చక్రాల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సుభద్ర యోజనను ప్రారంభించడానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేస్తున్న సందర్భంగా నగరం అంతటా భారీ బందోబస్తుతో భద్రతా వ్యవస్థని పటిష్టపరిచిన పరిస్థితుల్లో యువకులు ఈ దుమారం రేపడం సర్వత్రా చర్చనీయాంశం అయింది.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు

రాయగడ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విశ్వకర్మ పూజలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. స్థానిక గజలక్ష్మీ పూజ మండపం సమీపంలో, ప్రజా పనుల శాఖ కార్యాలయం ప్రాంగణంలో, విద్యుత్ శాఖ కార్యాయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేపట్టారు.

పర్లాకిమిడి: స్థానిక పీడబ్ల్యూడీ రోడ్డు, భవనాల శాఖ వద్ద విశ్వకర్మ పూజలను ఘనంగా జరుపుకున్నారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూజా పట్నాయిక్ ఇతర మెకానిక్ సిబ్బంది హాజరవ్వగా, స్టేట్ బ్యాంకు రోడ్డులో లేత్ మిషన్, వంపు సెట్ల దుకాణదారులు విశ్వకర్మ పూజలు ఘనంగా జరుపుకున్నారు.



పర్లాకిమిడి: రోడ్లు-భవనాల శాఖ మెకానికల్ సెక్షన్‌లో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: పూజలందుకుంటున్న విశ్వకర్మ

ప్రారంభమైన బలి జాతర పూజలు



అమ్మవారి మందిరం గదిలో బలి జాతర పూజలు

రాయగడ: ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా బలి జాతర పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాయగడ ప్రజల ఆరాధ్య దైవం మజ్జిగౌరి మందిరం ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం జంఝావతి నది తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ బెరుకొ, పూజారులు లుల్లు బెరుకొ, లల్లు బెరుకొ తదితరులు అక్కడ నుంచి ఇసుకను తీసుకొచ్చి మజ్జిగౌరి అమ్మవారి మందిరం ప్రాంగణంలోని ఘటాలు భద్రంగా ఉంచే గదిలో నిలిపారు. దీంతో అమ్మవారి బలిజాత్రకు శ్రీకారం చుట్టారు. రైతులు ఈ ఏడాది కొత్తగా పండించిన ధాన్యాన్ని పూజలు నిర్వహించి తీసుకొచ్చిన ఇసుకలో వేస్తారు. తొమ్మిదో రోజున బలి జాతర ముగుస్తుంది. ఆఖరి రోజున పూజారి ముళ్లతో తయారు చేసే ఊయలలో ఊగడం, నిప్పులపై నడవడం వంటి కార్యక్రమాలను తిలకించేందుకు పరిసర ప్రాంతానికి చెందిన ప్రజలు హాజరవుతుంటారు.

ఆటో బోల్తా: ఏడుగురికి గాయాలు

రణస్థలం: కుమ్మరిపేట గ్రామ సమీపంలో గల మలుపు వద్ద ఆటో బోల్తా పడి ఏడుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్నేహితులతో కలిసి బావరాజు పవన్ కుమార్ అనే వ్యక్తి ఆటోలో రణస్థలం నుంచి చిల్లపేట యర్రవరం వెళుతుండగా కుమ్మరిపేట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడగా.. ధర్మవరం అఖిల్ అనే యువకుడికి బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులంతా విద్యార్థులే. క్షతగాత్రుడు అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేర కు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గేదెల అక్రమ తరలింపు అడ్డగింత

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా గేదెలను తరలిస్తున్న కంటైనర్‌ను నరసన్నపేట పోలీసులు కాపు కాచి సోమవారం ఉదయం పట్టుకున్నారు. మడపాం టోల్‌గేట్ వద్ద ఈ కంటైనర్‌ను గుర్తించి పట్టుకొని సీజ్ చేశారు. కంటైనర్‌లో 34 గేదెలు ఉండగా వీటిని బరంపురం నుంచి విశాఖపట్నం తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో ఈ కంటైనర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గేదెలను కొత్తవలస గోశాలకు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నీ కాయిట్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికల టెన్నికాయిట్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎస్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ద్వితీయ స్థానంలో ఎస్.సాయికుమార్ (విజయనగరం), తృతీయ స్థానంలో కేఎస్ శంకరప్రసాద్ (తూర్పుగోదావరి)తో పాటు వరుసగా 4,5,6 స్థానాల్లో జి.మహీధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్(విశాఖపట్నం), అలాగే బాలికల విభాగం నుంచి ప్రథమ స్థానంలో కె.జ్యోతిక (అనంతపురం), ద్వితీయ స్థానంలో హెచ్.దీక్షిత (అనంతపురం), తృతీయ స్థానంలో హెచ్.స్పందన (అనంతపురం)తో పాటు వరుసగా 4,5,6 స్థానాల్లో ఆర్.సాంస్కృతి (పశ్చిమ గోదావరి), కె.ఇందు (విజయనగరం), బి.గాయిత్రి(చిత్తూరు) నిలిచారు. జమ్ము కాశ్మీర్‌లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న జాతీయ టెన్నికాయిట్ పోటీలకు వీరు ఎంపికైనట్లు క్రీడా నిర్వాహకులు పైల గజేంద్ర ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైన బాలికలు అనకాపల్లిలో, బాలురు తూర్పుగోదావరి మండపేటలో శిక్షణ పొందుతారని వారు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న చారులతా మహాపాత్రో

పర్లాకిమిడి: స్థానిక గాంధీ స్మారక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య గజపతి జిల్లా వార్షిక ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఎన్నికలను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారులతా మహాపాత్రో, సలహాదారు గీతా దాస్, రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు సుకాంతి సబతో, ప్రాంతీయ కార్యదర్శి దీపక్ కుమార్ రౌత్, సురేంద్ర కులదీప్‌లు పరిశీలించారు. నూతన అధ్యక్షుడిగా ఎస్.తిరుపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముంగి రవికుమార్, ఉపాధ్యక్షులుగా పుష్పాంజలి బెహరా, ఎస్.త్రంగి గోమాంగో, కోశాధికారిగా వై.ఢిల్లీశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం సలహాదారునిగా దేవరాజ్ జెన్నాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షకులుగా ఎస్.ఢిల్లీశ్వరరావు, ప్రఫుల్ల చంద్ర ప్రధాన్‌లు వ్యవహరించారు.

పేదలపై టీడీపీ పెద్దల ప్రతాపం



ఇంటి పట్టాతో రమణమ్మ, బాబూరావు

జలుమూరు: తిమడాంలో 90 ఏళ్లుగా నివాసం ఉంటోన్న ఓ పేద కుటుంబంపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. తొంభై ఏళ్లుగా ఆ కుటుంబం ఇక్కడే నివసిస్తుండగా.. వైఎస్సార్ సీపీ హయాంలో పట్టా ఇచ్చారు. ఆర్థిక స్థోమత లేక వారు ఇల్లు కట్టుకోలేకపోయారు. మట్టి గోడలతో చిన్నపాటి ఇల్లు కట్టుకొని ఇంటి ముందు టిఫిన్ బండి పెట్టి జీవనం సాగిస్తున్నారు. వీరు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే అనుమానంతో కొందరు టీడీపీ నాయకులు పట్టాను మాయం చేసి పోలీసులతో వేధిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఇంటిలో గొడెయ అమ్మన్న, కృష్ణ మూర్తి టిఫిన్ విక్రయిస్తూ జీవిస్తున్నారు. కొన్నేళ్ల కిందట కృష్ణమూర్తి మృతి చెందాడు. 25 రోజుల కిందట అమ్మన్న కూడా చనిపోయారు. దీంతో టీడీపీ పెద్దల కళ్లు ఆ ఇంటిపై పడ్డాయి. అమ్మన్న మృతిని సాకుగా తీసుకుని ఆ పేద కుటుంబంపై టీడీపీ పెద్దలు తమ ప్రతాపం చూపుతున్నారు. అమ్మన్న బతికి ఉన్నప్పుడే కుమార్తె రమణమ్మ, అల్లుడు బాబూరావు ఇక్కడే టిఫిన్ షాపు పెట్టారు. ఇప్పుడు ఇంటి స్థలం తమదే అంటూ టీడీపీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారని వారు వాపోతున్నారు. న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించామని అయినా బెదిరింపులు మానడం లేదని అంటున్నారు. దీనిపై జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు మాట్లాడుతూ కేసు కోర్టులో ఉన్నందున దీనిపై మాట్లాడకూడదని వారిని పిలిపించి చెప్పామన్నారు.

చినుకు పడితే వణుకే



బూర్జ గ్రామం వద్ద గట్టు లేక సమాంతరంగా ఉన్న నాగావళి నది

- వంశధార, నాగావళి కరకట్టల కోసం తీర ప్రాంత వాసుల ఎదురుచూపులు
- నదీ తీర ప్రాంతవాసులకు ఏటా తప్పని ముంపు భయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని వంశధార, నాగావళి నదీ తీర ప్రాంత వాసులు చినుకు పడితే చాలు వణికిపోతున్నారు. జూలై నెల నుంచి దాదాపుగా నాలుగు నెలల పాటు వీరంతా భయంభయంగా గడుపుతున్నారు.

నాగావళి నది మన వద్ద మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలంలో చిలకాపల్లి నుంచి శ్రీకాకుళం మండలం కల్లేపల్లి వరకు సుమారు 110 కిలో మీటర్లు మేర ఉంది. ఈ తీర ప్రాంతానికి ఆనుకుని వందలాది గ్రామాలు ఉన్నాయి. బూర్జ మండలంలో లాభాం, బూర్జ, కాఖండ్యాం, ఆమదాలవలస మండలంలో దూసి, తొగరాం, ముద్దాడపేట, దూసిపేట, తోటాడ, ఇసుకలపేట, శ్రీకాకుళం మండలంలో బలగ, హయాతీనగరం, ఫాజుల్‌బాగ్‌పేట, పెలసవీధి ఏటా ముంపు భయాన్ని ఎదుర్కొంటున్నాయి. ముంపు బారి నుంచి వీరిని రక్షించడానికి 2007లో వైఎస్సార్ హయాంలో కరకట్టల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ పనులు వంద శాతం పూర్తి కాని కారణంగా ఇప్పటికీ తీర ప్రాంత వాసులు వరదంటేనే వణికిపోతున్నారు. పనులు ప్రారంభించి పదిహేనేళ్లవుతున్నా 51.88 కిలోమీటర్ల పనులకు కేవలం 17.20 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యాయి. కాంక్రీట్ పనులు సీసీవాల్స్ 3.18 కిలోమీటర్ల పనులకు గాను 2.13కిలోమీటర్ల మాత్రమే పూర్తి చేశారు. దీనికి తోడు ఇసుక అక్రమార్కులు ఇదే కరకట్టలపై భారీ వాహనాలతో ఇసుక తరలించుకునేందుకు మార్గాలుగా వినియోగించడంతో గట్లు బలహీన పడుతున్నాయి.

వంశధార కరకట్టల పనుల కథ కూడా అంతే. జిల్లాలో కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, శ్రీకాకుళం, గార మండలాల్లో సుమారు 82కిలోమీటర్ల పొడవున వంశధార ప్రవహిస్తోంది. కానీ ప్యాకేజీ–1లో 8 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగలిగారు. ప్యాకేజీ–2లో 5 శాతం పనులు, ప్యాకేజీ–3లో ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రావర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు దొంగ బీసీలు పెట్టడంతో వీరిని పూర్తిగా టెర్మినేట్ చేశారు. ప్యాకేజీ–4లో పనులేవీ చేయలేదు.

చర్యలు చేపడతాం



వంశధార, నాగావళి కరకట్టల పనుల్ని పాతకాంట్రాక్టుల వద్ద గత ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశారు. కొత్తగా అంచనాలు వేయాలని ఆదేశించారు. అంచనాలను పంపించాం. ఈ ప్రభుత్వంలోనైనా మిగిలిన పనులకు నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు సంరక్షించగలుగుతాం.

– పొన్నాడ సుధాకర్, జలవనరులశాఖ ఎస్ఈ, శ్రీకాకుళం.

ఏటా ఇబ్బంది పడుతున్నాం



ఏటా వర్షాకాలం వచ్చిందంటే గ్రామంలో ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నాం. అలాగే పంట పొలాలు మునిగిపోతున్నాయి. నాగావళి నది పక్కనే ఉండడం మాకు శాపంగా మారింది.

– భైరి కృష్ణమూర్తి, బూర్జ గ్రామం, బూర్జ మండలం

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈనెల 13,14,15 తేదీల్లో అమలాపురం కోనసీమ జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా పరిషత్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఎస్.రామకృష్ణ 74 కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం, కె.జగదీష్ 59 కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం, ఎ. రాజా 69కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం సాధించారు. మాస్టర్స్ విభాగంలో ఎం.గోపీకృష్ణ ఒక వెండి, ఒక కాంస్య పతకం చేజిక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కోడి రామమూర్తి వ్యాయమ సమాజం ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని రెడ్డిక వీధికి చెందిన జామి అప్పారావు(40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పారావు తాగుడుకు బానిసై ఇంట్లోని సామగ్రి అమ్మి మరీ తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో భార్య ఆదిలక్ష్మి అప్పారావును మందలించి పట్టణంలోని కోరాడ వీధిలో ఉన్న కన్నవారింటికి ఆదివారం వెళ్లిపోయింది. సోమవారం ఉదయం అప్పారావు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంటి యజ మాని గమనించి ఆదిలక్ష్మికి సమాచారమందించారు. దీంతో ఆమె వచ్చి చూడగా సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని భర్త చనిపోయి ఉన్నాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై టి.శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ..



విజయనగరం క్రైమ్: సహజీవనం చేస్తున్న వ్యక్తి పెడుతున్న టార్చర్ భరించలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాలపడింది. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరులో అగ్రికల్చర్ విభాగంలో ఏఈఓగా పనిచేస్తున్న రెడ్డి హైమావతి (34)కి 2009లో పెళ్లయింది. కానీ 2014లోనే భార్యాభర్తలు విడిపోయారు. వారికి బాబు, పాప ఉన్నారు. నాటి నుంచి పిల్లలతో సాలూరులోనే ఆమె నివసిస్తోంది. భర్తతో విడాకుల అనంతరం ఆమె తమ కుటుంబానికి చెందిన నల్లగోపి అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఆమె పదేళ్ల క్రితమే విజయనగరంలోని రామానారాయణం ప్రాంతంలో అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసింది. రెండేళ్ల క్రితం సాలూరు నుంచి ఆమె షిఫ్ట్ అయి విజయనగరంలో ఉంటుండగా పిల్లలు విశాఖలో చదువుతున్నారు. సహజీవనం చేస్తున్న గోపికి హైమావతి మరో వ్యక్తితో మాట్లాడుతోందనే అనుమానం మొదలై రోజురోజుకూ పెనుభూతంగా మారింది. దీంతో నిత్యం ఆమెను టార్చర్ పెట్టడం, ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించాడు. అదే తరహాలో ఆదివారం కూడా ఆమెను ఇబ్బంది పెట్టడంతో మనస్తాపం చెందిన హైమావతి జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే సీలింగ్‌ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ తెలిపారు.

కోనేరులో పడి ఒకరి మృతి

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం గ్రామంలో మంచినీటి కోనేరులో ఆదివారం రాత్రి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం నగర్‌కు చెందిన కునుకు రాం ప్రసాద్ (34) తన స్నేహితుడి ఇంటికి వెళ్లి గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం కాలకృత్యాల నిమిత్తం గ్రామ సమీపంలోని మంచినీటి కోనేరుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన పలువురికి రాంప్రసాద్ చెరువులో విగతజీవిగా కనిపించాడు. దీంతో వారు పోలీసులకు, మృతుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలంలో పరిశీలించి మృతదేహానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు బైక్ మెకానిక్. భార్య, తల్లిదండ్రులు, పిల్లలున్నారు.

జుడో క్రీడాకారుల ఎంపిక రేపు

బొబ్బిలి: ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జుడో పోటీల్లో పాల్గొనేందుకు బాలబాలికల ఎంపిక పోటీలను ఈనెల 18 ఉదయం 9 గంటల నుంచి రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అండర్ 17,14 స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివరాలకు సెల్ 94401 27587 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్యవిద్య చేరువ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జిల్లాలో వైద్యకళాశాల ఏర్పాటు
- 150 మందికి వైద్యవిద్యను అభ్యసించే అవకాశం
- సెకెండ్ ఇయర్‌లోకి అడుగుపెడుతున్న విద్యార్థులు
- వైద్యకళాశాల ఏర్పాటుతో చదువుకు అవకాశం అంటున్న విద్యార్థులు
- ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుపై ఆందోళన



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్య కళాశాల

విజయనగరం ఫోర్ట్:

వైద్య విద్య.. ధనవంతుల పిల్లలకే అన్న నానుడి ఉండేది. వైద్య కళాశాలలు తక్కువగా ఉండడం, సీట్లు పరిమితంగా ఉండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారేది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు లభించక, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చదివే ఆర్థికస్థోమత లేక ర్యాంకు వచ్చినా చాలామంది విద్యార్థులు సీట్లు వదులుకునేవారు. మంచి ర్యాంకు సాధన కోసం ఏళ్ల తరబడి శ్రమించేవారు. ఈ పరిస్థితిని గమనించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల మంజూరుకు కృషిచేసింది. అందులో తొలివిడతగా మంచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మించింది. ప్రవేశాలు సైతం కల్పించింది. మొదటి ఏడాది వైద్యవిద్యను పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఏడాది రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యకళాశాలలు వద్దంటూ జాతీయ వైద్యకమిషన్‌కు లేఖరాయడం, ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటు పరం చేసేయత్నాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యవిద్యకు నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి, నేటి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చజోరందుకుంది.

రాష్ట్ర వ్యాప్తంగా 750 మందికి ప్రవేశాలు

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడం వల్ల 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. విజయనగరం జిల్లాకు సంబంధించి 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్య భాగ్యం కలిగింది. గతంలో ప్రైవేటు వైద్య కళాశాలలు అధికంగా ఉండడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య విద్యను చదువుకోలేకపోయేవారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను అధికంగా అందుబాటులోకి తేవడం వల్ల ఎక్కువ మందికి వైద్య విద్యను అభ్యసించే అవకాశం లభించింది.

కార్పొరేట్ కంటే మిన్నగా వసతుల కల్పన

కార్పొరేట్ మెడికల్ కాలేజీలు కంటే మిన్నగా ప్రభుత్వ వైద్యకళాశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వసతులు కల్పించింది. విద్యార్థుల చదువుకు అవి దోహదపడుతున్నాయి. విజయనగరం ప్రభుత్వ వైద్యకళాశాలలో మొదటి ఏడాది విద్యార్థుల కోసం నిర్మించిన హిస్టలాజీ, బయో కెమిస్ట్రీ, అనాటమీ, ఫిజియాలజీ ల్యాబ్‌లు, అందులో వసతులు అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులే ప్రశంసిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో వైద్య విద్యను అభ్యసిస్తున్నామంటూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుతో సీటు వచ్చింది



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడం వల్ల నాకు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. వైద్య కళాశాలలు రాకుండా ఉండి ఉంటే మాలాంటి వారికి సీటు రావడం కష్టం. మొదటి ఏడాది పూర్తయింది. రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రావడం చాలా సంతోషంగా ఉంది.

– మనస్విని బడగల, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

మొదటి ఏడాది పూర్తయింది..



మొదటి ఏడాది ఎంబీబీఎస్ పూర్తయింది. రెండో ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. వైద్య కళాశాలలో వసతులు అద్భుతంగా ఉన్నాయి. ఎంతో అనుభవం గల ప్రొఫెసర్లు ఉన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు కావడం వల్ల వైద్యవిద్య సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారికి అందుబాటులోకి వచ్చింది.

– ఎ.హారిక, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

గర్వంగా ఉంది



ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రావడం గర్వంగా ఉంది. గత ప్రభుత్వం వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల నాకు ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఆహ్లాదకర వాతావరణంలో మొదటి ఏడాది పూర్తి చేశాను. రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను. విద్యా బోధన చాలా బాగుంది.

– టి.రిషిచంద్ర, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

రాష్ట్ర స్థాయి పోటీలకు చీపురుపల్లి ఉపాధ్యాయుల టీం



జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి ఉపాధ్యాయుల జట్టు

చీపురుపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో చీపురుపల్లి మండల ఉపాధ్యాయుల జట్టు విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో సోమవారం యూటీఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చీపురుపల్లి, గజపతినగరం మండలాలకు చెందిన ఉపాధ్యాయుల జట్లు తలపడ్డాయి. అందులో చీపురుపల్లి జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. దీంతో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున చీపురుపల్లి ఉపాధ్యాయుల జట్టు పాల్గొననుంది. జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి జట్టుకు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని కోరారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి జట్టుకు కెప్టెన్‌గా పిసి.స్వరూప్, వైస్ కెప్టెన్‌గా బాసిన సతీష్, వికెట్ కీపర్‌గా ఏవీఆర్‌డీ.ప్రసాద్‌లు వ్యవహరించారు.

బొలెరో ఢీకొని మహిళ మృతి



సరస్వతి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్ సమీపంలో జాతీయరహదారిపై సోమవారం సాయంత్రం బొలెరో వాహనం ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పరవాడ మండలం గొర్లె వానిపాలెం గ్రామానికి చెందిన మిరయాల సరస్వతి (51) శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లి తిరుగుప్రయాణంలో సీహెచ్ అగ్రహారం జంక్షన్ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి రహదారి దాటుతుండగా మితిమీరిన వేగంతో వచ్చిన బొలెరో వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం మేరకు సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత జీవన విధానం కావాలి

- నేటినుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత జిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీని స్వచ్ఛభారత్ దివస్‌గా పాటిస్తున్నామని గుర్తు చేశారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకోనున్నట్లు వివరించారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించడమే ధ్యేయంగా ముందడుగు వేయాలని అధికారులకు సూచించారు. సమాజం మొత్తాన్ని భాగస్వాములను చేసేలా పక్షం రోజుల పాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛతా కీ భాగీదారి విభాగంలో తగిన ప్రచారంతో ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవహారాలు నిర్వహించాలని సూచించారు. మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందరీకరణ పనులు చేపట్టవలసి ఉందన్నారు. స్వచ్ఛత లక్షిత్ ఏకాయి-సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాలలో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపాలని పేర్కొన్నారు. సఫాయి మిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలు చేపట్టాలని, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయడం తదితర అంశాలను చేపట్టాలని కోరారు. వారికి ప్రత్యేకంగా భద్రతా శిక్షణ, పీపీఈ కిట్లు అందజేయాలని పేర్కొన్నారు. పరిశుభ్రతను కాపాడే క్రమంలో పౌర భాగస్వా మ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

'రోజువారీ కార్యక్రమాల వివరాలు

- 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, ఆరోగ్య సంరక్షణ సేవలు
- 18న స్వచ్ఛత పరుగు, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ
- 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, దంపేల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం
- 20న మొక్కల పెంపకం,
- 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీఈ కిట్‌లు, సేఫ్టీగేర్లు పంపిణీ
- 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ,
- 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత
- 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రల అవగాహన
- 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం,
- 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ
- 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాల సేకరణ,
- 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు
- అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలి అగ్నిప్రమాదం

- 12 నాటుకోళ్లు, 4 ఫ్యాన్లు, బియ్యం ఆహుతి



ప్రమాదంలో కాలిపోతున్న నాటుకోళ్ల షెడ్

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో సోమవారం తెల్లవారుజామున 2 గంటలసమయంలో బాణసంచా పేలుళ్లతో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పాక, కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇందుకు సంబంధించి ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కాల్చిన బాణసంచా రవ్వలు పడి ముదారపు ఈశ్వ్రావు పాక అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో 12 నాటు కోళ్లు, నాలుగు ఫ్యాన్లు, వంటపాత్రలు, టేకు కలస 25 కేజీల బియ్యం కాలి పోయినట్లు ఆయన చెప్పారు. సుమారు రెండు లక్షలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వీఆర్‌ఓ వి.శ్రీను తదితరులు వచ్చి సంఘటానా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన నివేదికను తహసీలోద్దార్‌కు అందజేసినట్లు వీఆర్‌ఓ తెలిపారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవం పోసి బిడ్డను తల్లికి అప్పగించిన సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ కొండప్రాంతంలో ఉన్న శనగపాడు గ్రామానికి చెందిన జన్ని సన్యాసమ్మ ఫీడర్ అంబులెన్స్‌లో ఆదివారం రాత్రి బిడ్డను ప్రసవించింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సన్యాసమ్మ ప్రసవ నొప్పులతో ఇబ్బంది పడుతుండగా ఆదివారం రాత్రి 11గంటల సమయంలో హెల్త్ అసిస్టెంట్ తాతారావుకు ఫోన్ చేశారు. దీంతో తాతారావు ఫీడర్ అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ దాలిబాబు శనగపాడు వెళ్తుండగా, అప్పటికే బంధువులు ఆమెను డోలీలో మెట్టపాలెం వరకూ తీసుకొచ్చారు. అంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా బొడ్డపాడు వద్దకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఆపి సిబ్బంది ఆమెకు పురుడు పోయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీపిల్లలను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి అబులెన్స్‌ను తరలించారు.

మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాద్ ఉన్ నబీ



విజయనగరంలో ముస్లిం సోదరుల ర్యాలీ



పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం క్రైమ్: మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ ప్రశాంతయుతమైన వాతావరణంలో ముగిసిందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. జిల్లాలో ఈద్ పండగ నేపథ్యంలో ముస్లిం సోదరులు చేపట్టిన ర్యాలీలు ఆద్యంతం భక్తి భావాన్ని చాటిచెప్పాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పట్టణంలోని అబాద్ వీధి నుంచి ప్రారంభమైన ర్యాలీ కోట జంక్షన్, సింహాచలం మేడ, బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, పైడితల్లి అమ్మవారి ఆలయం, మూడు లాంతర్లు మీదుగా తిరిగి ఆబాద్‌వీధికి చేరుకుంది. ర్యాలీలో సుమారు 1500 మంది ముస్లిం సోదరులు పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు. బందోబస్తులో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్సైలు ప్రసన్నకుమార్, నరేష్, హరిబాబునాయుడు, సుదర్శనరావు, సూర్యకుమారి, దుర్గాప్రసాద్, వీరజనార్దన్, చిన్నారావు, లోవరాజు, శంబంగి రవి, ఎ.మహేశ్వరరాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి సజీవ దహనం



వృద్ధుడు పెంట చిన్ననాగు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంట చిన్ననాగు(74) భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయనకు బీడీ తాగే అలవాటు ఉండడంతో ఎప్పటిలాగే ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో మంచంపై నిద్రిస్తూ బీడీ తాగి కాలుతున్న బీడీని నిద్రమత్తులో మంచంపై పెట్టాడు. మంచం పట్టి ప్లాస్టిక్ కావడంతో బీడీనిప్పు అంటుకుని మంటలు వ్యాపించిమంచం కాలిపోవడంతో దానిపై పడుకున్న వృద్ధుడి తల నుంచి కాళ్ల వరకూ శరీరమంతా కాలిపోయింది. దీంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి ఇద్దరు మగపిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య సూరీడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీఎస్.మూర్తి చెప్పారు.

మూడు నెలల్లో 3 చైన్ స్నాచింగ్స్

- ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్న దొంగలు

వీరఘట్టం: మండలంలో ఆగంతుకులు పల్సర్ బైక్‌పై వస్తూ ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారం చైన్లు తెంచుకుని పోతూ దొరక్కుడా తప్పించుకుంటుండడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. రోడ్డుపై బస్సుల కోసం ఒంటరిగా నిరీక్షిస్తున్న మహిళలు, పొలాలకు వెళ్లే వారిని గమనిస్తూ వారి మెడలో ఉండే బంగారం చైన్లు, పుస్తెల తాళ్లు చాకచక్యంగా తెంపి పారిపోతూ సవాల్ విసురుతున్న ఆ దొంగలు ఎవరో తెలియక పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ ఏడాది జూన్ 21న సీఎస్‌పీ రహదారిలో పాపంపేట జంక్షన్ వద్ద ఒంటరిగా ఉన్న తైలాడ తవిటమ్మ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు చైన్‌ను ఆగంతుకులు తెంపుకుని పోయారు. తర్వాత ఆగస్టు 3న వండవ జంక్షన్ వద్ద అవదూతల మల్లీశ్వరి అనే మహిళ మెడలో ఉన్న 1.50 తులాల బంగారు చైన్ తెంచి పారిపోయారు. తాజాగా సోమవారం నడిమికెల్ల గ్రామానికి చెందిన యామక గౌరమ్మ ప్రకృతి వ్యవసాయ పనుల కోసం చిట్టపులివలస గ్రామం వెళ్లింది. ఆమె రాకను గమనిస్తూ వస్తున్న ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు రెండుతులాల బంగారు పుస్తెల తాడును తెంపి పారిపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ చిట్టపులివలస గ్రామానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

అప్రమత్తంగా ఉండాలి

పొలాలకు వెళ్లే, రోడ్లపై బస్సుల కోసం ఎదురుచూసే, వాకింగ్‌కు ఒంటరిగా వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు.అనుమానం వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం బాధితురాలు గౌరమ్మ నుంచి ఆగంతుకుల ఆనవాళ్లు తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

- కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: కార్పొరేషన్ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ప్రతిరోజూ నిర్వహించనున్న కార్యక్రమాలపై వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అమలు చేస్తున్న స్వచ్ఛతా హి సేవా – 2024 కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు అయ్యకోనేరు వద్ద భారీ మానవహారం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్య సంస్థలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం అయ్యకోనేరును శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఏఒ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.